క్లుప్తంగా

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇచ్చోడ సీఐ భీమేశ్

ఇచ్చోడ: దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుర్గామాత మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయమే కార్యక్రమాలను పూర్తి చేసుకొని నిమజ్జన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. డీజేలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, ఏఎస్సై ఫీర్ సింగ్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, దుర్గాదేవీ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గొండి పాట చిత్రీకరణ



షూటింగ్‌లో నటీనటులు

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి), కొజ్జన్‌గూడ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం గొండి పాట చిత్రీకరణ చేపట్టారు. కొజ్జన్‌గూడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పుర్కే శ్రీకాంత్ పాటను రచించగా, కళాకారులతో చెరువు, అటవీ ప్రాంతంలో పాటను చిత్రీకరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డైరెక్టర్ నాగోరావు, నిర్మాత కర్పతే ధర్మ, గాయకులు శ్రీకాంత్, మంగళ, ఆర్టిస్టులు దివ్య, గణేష్ పాల్గొన్నారు.

పీఆర్ ఏఈఈగా దినేష్



పీఆర్ ఏఈఈ దినేష్ కుమార్

నేరడిగొండ: మండల పంచాయతీరాజ్ ఏఈ ఈగా రాథోడ్ దినేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పీఆర్ ఏఈఈ అభినవ్ బదిలీ అయ్యారు. నూతనంగా ఉద్యోగం పొందిన దినేష్ కుమార్ నేరడిగొండ పీఆర్ ఏఈఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పంచాయతీరాజ్‌కు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు జరిగేలా చూస్తానని అన్నారు. ఏవైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేడు చెక్కుల పంపిణీ

ఇచ్చోడ: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఆర్‌ఐ హుస్సేన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి రావాలని కోరారు.

మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రెటరీని కలిసిన 'కంది'



వినతిపత్రం అందజేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదారాబాద్‌లోని తన కార్యాలయంలో కలిసిన ఆయన ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల కేటాయింపుపై చర్చించారు. ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నిధుల విడుదలకు హామీ ఇచ్చిన ప్రత్యేక కార్యదర్శికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఈ మనోజ్

తాంసి: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లును ప్రతీ నెల చెల్లించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలో సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లులు వసూల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏఈ వెంట సిబ్బంది సంజీవ్, రమణ ఉన్నారు.

వైభవంగా కుంకుమార్చన



తాంసి: వడ్డాడిలో పూజలు చేస్తున్న మహిళలు



ఇంద్రవెల్లి: పర్థాన్‌గూడలో..

తాంసి/ఇంద్రవెల్లి/ఇచ్చోడ : తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలో, ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పర్థాన్‌గూడ శ్రీగొండి ధర్మ గురు హీరాసుక్క దుర్గమాత మండపం వద్ద, ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్, విద్యానగర్, టీచర్స్‌కాలనీ, ఎంప్లాయిస్ కాలనీల్లో బుధవారం వైభవంగా కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు



ఇచ్చోడ: విద్యానగర్‌లో పాల్గొన్న మహిళలు

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఇంకుడు గుంత పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024లో భాగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024లో నిర్మాణం చేస్తున్న ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024 అవార్డులో భాగంగా గ్రామంలో 72 మరుగుదొడ్లు, 173 ఇంకుడు గుంతలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులను అధికారులు వేగవంతం చేయాలన్నారు. మరుగుదొడ్లను ఉపయోగించడంతో పాటు గ్రామ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు విఠల్, సుందర్‌సింగ్, ధమ్మనంద్, తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, వీధి దీపాలు, మిషన్ భగీరథ మంచి నీటిసరఫరా ఇలా ప్రతీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. ఈజీఎస్‌లో పనిచేసే ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి పనులతో పాటుగా నాటిన మొక్కలను పరిరక్షించే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ చంపత్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు తరలిరావాలి



మాట్లాడుతున్న మహిళా ప్రతినిధులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే బతుకమ్మ వేడుకలకు మహిళలు, యువతులు తరలిరావాలని సమితి మహిళా ప్రతినిధులు మాలతి, శశికళ చౌహన్, రమ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడిపాడిన వారికి ప్రోత్సాహకంగా మూడు నగదు బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, గెడం మాధవ్, సూర్యకాంత్, కందుల రవీందర్, సతీష్, కొత్తపల్లి సంజీవ్, వేణు, గణేష్ పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలి



మాట్లాడుతున్న శ్యాముల్

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగంలో కార్పొరేటీకరణ, కాషాయికరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానం 2020ని తిరస్కరించాలని విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ శ్యాముల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీఎస్ఈసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్య రంగంలో వస్తున్న మార్పుల గమ్యం ఎటువైపు అనే అంశంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 20 శాతం విద్యా రంగానికి నిధులు కేటాయించాలన్నారు. 1 నుంచి 3 తరగతులకు అంగన్‌వాడీలో కలిపే ఆలోచనను విరమించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చి అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వృకోధర్, సాయినాథ్, రామేశ్వర్, వెంకటనారాయణ, గణేష్, సంతోష్, అశోక్, రాహుల్, తబ్రేజ్ ఖాన్, సుధాకర్, నాగేందర్, దిలీప్, రాకేశ్, అక్షయ్, దత్తు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని మాధవరావు స్మారక భవనంలో నవంబర్ 7, 8, 9వ తేదీల్లో నిర్వహించే సీపీఎం 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని రెండేళ్లుగా ఐక్య పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం, టెక్స్‌టైల్ పరిశ్రమం, కేంద్ర యూనివర్సిటీ కోసం పోరాడుతోందని గుర్తు చేశారు. మొదటి రోజు పదివేల మందితో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, బండి దత్తాత్రి, మంజుల, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణం



ఊరేగింపుగా తీసుకెళ్తున్న స్వామి అభరణాలు

తలమడుగు: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం బుధవారం గోవింద నామస్మరణతో మార్మోగింది. గ్రామ పుట్టింటి ఆడబిడ్డలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో స్వామి వారికి మకర తోరణం, అలంకరణ ఆభరణాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వేద పండితుల వేదమంత్రాలతో స్వామివారికి అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. స్వామివారికి, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కాటిపల్లి వసంత్ రెడ్డి, పద్మాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, అభిరామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, నవీన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరికొండలో ఉపాధిహామీ గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

సిరికొండ: మండలంలోని సిరికొండ గ్రామ పంచాయతీలో బుధవారం 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ ఏడాదిలో ఉపాధి పథకం కింద చేపట్టిన పనులను రైతులు, గ్రామస్తులకు అధికారులు అడిగి తెలుసుకున్నారు. అలాగే చేయాల్సిన పనులు ఎంపిక, వాటికి తీర్మానం చేశారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి రవీందర్ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్క కూలీ ఉపాధి హామీ పథకంలో పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, టీఏ స్వరూప, ఎఫ్ఏ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బోనాల సందడి



బోనాలతో మహిళలు

నేరడిగొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వడూర్ గ్రామంలో బుధవారం బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ప్రతిమ వద్ద నుంచి ఆడపడుచులు బోనాలను ఎత్తుకొని శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల నృత్యం ఆకట్టుకుంది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

జగదాంబ దేవికి ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: మండలంలోని రాజురా గ్రామంలోని శ్రీ జగదాంబ దేవి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 7వ రోజు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో పాటు జాన్సన్ నాయక్‌ను ఘనంగా సత్కరించారు.

జిరాక్స్ సెంటర్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి సీజన్‌లో రైతులకు జిరాక్స్ సౌకర్యం కోసం జిరాక్స్ సెంటర్ నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము రూ.300 చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిరాక్స్ పేజీలకు ధర నిర్ణయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కైలాస్ టెకిడి వరకు రోడ్డు నిర్మాణం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని కైలాస్ టెకిడి నర్మదేశ్వర ఆలయం వరకు రూ.12 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. బుధవారం మండలంలోని కైలాస్ టెకిడి నర్మదేశ్వర ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆలయానికి వెళ్లే క్రమంలో బాబెరతండా, నిగిని గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువాతో సత్కరించారు.

దుర్గామాత పల్లకి ఊరేగింపు



బోథ్: శోభాయాత్రలో భక్తులు

బోథ్: మండల వ్యాప్తంగా దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో కుంకుమార్చన నిర్వహించారు. ధన్నూర్(బి) గ్రామంలో దుర్గామాత ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి శోభాయాత్ర చేపట్టారు. మహిళలు బోనం ఎత్తారు. అమ్మవారి పాటలకు స్వాములు, మహిళలు నృత్యం చేశారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

దుర్గామాత ఆలయానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

తలమడుగు: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దుర్గామాత భక్తులు కొత్తూరు గ్రామంలోని దుర్గామాత ఆలయానికి బుధవారం పాదయాత్రగా వెళ్లారు. ప్రతీ ఏడాది దుర్గామాత ఆలయానికి పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సారే సమర్పించడం అనవాయతీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, అంగన్‌వాడీ టీచర్ శాంత, చౌహన్ అనిత, ఈశ్వరి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.



రవికి మెమొంటో అందజేస్తున్న సభ్యులు

అమెరికా సంబురాల్లో పాల్గొన్న రవి

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన రేలరేల కళాకారుడు చహకటి రవి అమెరికాలోని కాన్సస్ సిటీలో తెలంగాణ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొని ఆటపాటలతో అలరించారు. సంబురాల అనంతరం తెలంగాణ కల్చర్ అసోసియేషన్ రవికి మెమొంటో అందచేశారు.

పెసా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

నార్నూర్: ఏజెన్సీలో 1/70 పెసా చట్టాలను గ్రామ స్థాయి నుంచే పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసా చట్టం ప్రకారం గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనరాదు, అమ్మరాదన్నారు. భూమిని అద్దె లేదా కౌలుకు తీసుకున్న నేరమేనన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టరాదని అన్నారు. గిరిజనేతరులు ఎవరైనా ఇంటి పని ప్రారంభిస్తే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శిలు నోటిసులు ఇచ్చి పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. చట్టాలపై అవగాహన లేకుంటే ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్, తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీవో స్వప్నశీల, ఈజీఎస్ ఏపీవో సురేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి

- మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్



మెప్మా ఉద్యోగులతో సమీక్షిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ఆదిలాబాద్ పట్టణానికి నిర్దేశించిన యూనిట్లను వారం రోజుల్లోగా గ్రౌండింగ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మెప్మా ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళ శక్తి కింద పట్టణానికి మహిళ క్యాంటీన్‌తో పాటు మీసేవ కేంద్రం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, సెంట్రింగ్ యూనిట్‌లను కేటాయించిందన్నారు. అర్హులైన ఎస్‌హెచ్‌జీ సభ్యులను గుర్తించాలని సూచించారు. వారం రోజుల్లోగా యూనిట్లను ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గురువారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లుగా తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మెప్మా డీఎంసీ శ్రీనివాస్, టీఎంసీ భాగ్యలక్ష్మి, రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.